క్లుప్తంగా

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ(నూజెండ్ల): రూరల్ మండలంలోని బాలాజీ ఐటీఐ కళాశాలలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 23వ తేదీన జరిగే 4వ విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5గంటల లోపు పదో తరగతి మార్కుల లిస్ట్, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9440842030, 8341821710 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

దివ్యాంగులకు 14న ప్రత్యేక వైద్య శిబిరం

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని సచివాలయంలో దివ్యాంగులకు ఆర్థోలోపం ఉన్న వారికి ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కమిట్‌మెంట్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న మండల కేంద్రంలోని సచివాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తిగా చూపులేని వారు, వినికిడి లోపం గలవారు, స్క్రీనింగ్ క్యాంపులో నిర్ణయించి వారికి ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు. పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు 2, ఆధార్, సదరన్, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం కమిట్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ లోకో మోటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం



బొల్లాపల్లి: తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో మండలంలోని పమిడిపాడు గ్రామంలో చర్చి నిర్మాణం నిమిత్తం ఆర్థిక వితరణ అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన మాచర్ల పీటర్ పాల్, ఎస్. రాజేష్ ఇరువురు చర్చి నిర్మాణం నిమిత్తం గ్రామానికి చెందిన బాప్టిస్ట్ చర్చి కాపరి ఎం. గమానియేలు, సంఘ పెద్దలకు మంగళవారం రూ.50 వేలు ఆర్థికంగా సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్థిక వితరణ చేసిన వారిని గ్రామ సంఘ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు మాచర్ల పీటర్ పాల్ తెలిపారు.

రావులాపురంలో ఫ్యామిలీ డాక్టర్



బొల్లాపల్లి: మండలంలోని రావులాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి. శంకర్‌నారాయణ, వైద్య బృందం ఈ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో షుగర్, బీపీ, గర్భిణులు, జనరల్ వ్యాధులకు సుమారు 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశామని వైద్యాధికారి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందేలా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే విధంగా పీహెచ్‌సీ పరిధిలో తగు విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య బృందం, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎ-సెక్టార్ పరిధిలోని కొండమెట్లబజార్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఎస్సీ పథకం కింద పది రకాల పౌష్టికాహార పదార్థాలు (టీహెచ్ఆర్) టేక్ హోం రేషన్ రూపంలో ఏపీపీ ద్వారా గర్భిణీ, బాలింతలకు ఫస్ట్ ప్రైజ్ (టీహెచ్ఆర్) పంపిణీ చేయడం జరిగింది. గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించి గాజులు, జాకెట్ ముక్కలు, పండ్లు, తాంబూలం ఇచ్చి ఆశీర్వదించారు. గర్భిణులకు గేమ్ పట్ల అవగాహన కలిగించి పోషక విలువల కలిగిన ఆహారం తీసుకోవాల్సిన చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తహీనత నియంత్రించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలా దస్తగిరి, సూపర్‌వైజర్ మరియకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్‌కే మున్ని, ఎస్‌కే షకీలా పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేయడమే జగనన్న లక్ష్యం

- అందరికీ ఉచిత వైద్యం, విద్య, ఇళ్ల నిర్మాణాలు
- మంత్రి విడదల రజిని



లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ప్రజలకు మంచి చేయడం ద్వారా వారి మనసులు గెలుచుకొని మళ్లీ గెలవాలనే సిద్ధాంతంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణ పరిధిలోని పురుషోత్తమపట్నం 31వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని ఇంటింటికీ తిరుగుతూ వారికి జరిగిన మేలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, చేనేతలు, చేతివృత్తుల వారు ఇలా అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా సీఎం పరిపాలన కొనసాగిస్తున్నారని వెల్లడించారు. ప్రజల కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని చెప్పారు. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని వివరించారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంటిలోని భావిపౌరులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిషు మీడియం, జగనన్న విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. దీనికి తోడు వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింప చేసినట్లు చెప్పారు. రూ. 16వేల కోట్లతో గ్రామస్థాయిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల నిర్మాణం వరకు ఎంతో పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని పేర్కొన్నారు.

జగనన్న కాలనీలలో పేదవారి సొంతింటి కలలు సాకారం అవుతాయని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం ఎంతో చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ చైర్మన్ విడదల లక్ష్మీనారాయణ, 30వ వార్డు కౌన్సిలర్ షేక్ ఖాజాభాను, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి షేక్ గాలిబ్‌షా, పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అల్లీమియా, నాయకులు బైరా వెంకటకృష్ణ, విడదల కమలేంద్ర, తోట రామచంద్ర ప్రసాద్, విడదల హరినాథ్ బాబు, సయ్యద్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానానికి విరాళం

నరసరావుపేట: మండలంలోని ఇసప్పాలెం శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం జీర్ణోద్ధరణ పనులకు హాలీవుడ్ షాపు అధినేత చింతగుంట రఘురామిరెడ్డి రూ.1,00,116లు విరాళం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గృహంలో ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డికి ఎమ్మెల్యే గోపిరెడ్డి చేతుల మీదుగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు పాల్గొన్నారు.

జీడీసీసీ బ్యాంకు తనిఖీ

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు జీడీసీసీ బ్యాంకును ఏజీఎం బత్తుల బాలకృష్ణారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. బ్యాంకు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గత ఏడాది బ్యాంకు, సొసైటీల ద్వారా పంపిణీ చేసిన రుణాలను పరిశీలించారు. రుణాల పంపిణీ పై సొసైటీలవారీగా సమీక్షించారు. రైతులకు సకాలంలో రుణాలు అందించాలని బ్యాంకు సిబ్బందికి, సీఈవోలకు సూచించారు. గత ఏడాది పంపిణీ చేసిన రుణాలపై, వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ గూడూరి నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ కుమార్, వినీత, సీఈవోలు శివారెడ్డి, వీరారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దీపక్, మల్లయ్య, కోటిరెడ్డి, హనుమంతరావు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి జన్మదిన వేడుకలు



ఆర్డీవో కార్యాలయ సెంటర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి గజమాల వేస్తున్న నాయకులు



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిచే భారీ కేకు కట్ చేయిస్తున్న పార్టీ నాయకులు



ఫంక్షన్ హాలులో పేద మహిళలకు బియ్యం బస్తాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నరసరావుపేట: వేలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, శ్రేయోభిలాషులు తమ అభిమాన నాయకుడు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలో వందలాది వాహనాలతో ఊరేగింపు నిర్వహించి క్రేన్‌ల సహాయంతో గజమాలలు వేసి భారీ కేకులు కట్‌చేయించి, అన్నదానాలు నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తొలుత తన స్వగృహంలో కోటప్పకొండ, ఇసప్పాలెం మహంకాళీ అమ్మవారి దేవాలయంకు చెందిన పండితులచే ఆశీర్వచనాలు స్వీకరించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ప్రక్కనే ఉన్న నాయబు బజారు పెద్దమసీదులో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి నుంచి కార్లు, ద్విచక్రవాహనాలతో ర్యాలీగా బయలుదేరి శివునిబొమ్మసెంటర్‌లో ఆర్యవైశ్యులు ఏర్పాటుచేసిన కేకును కట్ చేశారు.

ఆర్డీవో కార్యాలయ సెంటర్‌లో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు క్రేన్ సహాయంతో గజమాల వేసి, కరవాలం బహూకరించి ఆయనచే భారీ కేకును కట్‌చేయించి శుభాకాంక్షలు తెలియచేశారు. శుభాకాంక్షలు తెలియచేసిన వారిలో ఆర్డీవో ఎం.శేషిరెడ్డి, డీఎస్పీ కేవీ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి, జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, పిల్లి ఓబులురెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్.ఏ.హనీఫ్, ఎంపీపీల మూరబోయిన శ్రీనివాసరావు, గడ్డం వెంకటరావు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు ఇయం.స్వామి, ఎస్.సుజాతాపాల్, పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, పాలపర్తి సామ్రాజ్యం, నాయకులు కాకుమాను సదాశివరెడ్డి, పూనూరి కోటిరెడ్డి, సానికొమ్ము కోటిరెడ్డి, మూరే రవీంద్రరెడ్డి, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, కేర్ కోటిరెడ్డి, కనకా పుల్లారెడ్డి, యన్నం రాధాకృష్ణారెడ్డి, యాంపాటి వెంకటప్పారెడ్డి, వంపుగుడిజాన్, షేక్ కరిముల్లా, కూనిశెట్టి హనుమంతరావు, యన్నం రామిరెడ్డి, యర్రంశెట్టి రాము, షేక్ ఖాదర్‌బాషా, వద్దుల సుబ్బారెడ్డి, కొమ్మసాని కమలాకరరెడ్డి, భీరం భాస్కరరెడ్డి, కామిరెడ్డి నరిసిరెడ్డి, దొండేటి అచ్చిరెడ్డి, కర్నాటి సాంబిరెడ్డి, మేకల మురళీమోహనరావు, పోలకమ్మ వెంకటరెడ్డి, భవనం సుధాకరరెడ్డి, రాయల శ్రీనివాసరావు, మారూరి శివారెడ్డి, కేపీ రంగారావు, ఊరా భాస్కరరావు, హాలీవుడ్ రఘు, ఎంఈ వేణుమాధవరావు, పచ్చవ రవీంద్రబాబు, టి.నరసింహ, పూనూరి కృష్ణకుమారి, దివ్వెల రామకృష్ణ, మాజేటి సాంబశివరావు, వి.సాంబశివరావు, సయ్యద్‌ఖాజా ఉన్నారు.

రొంపిచర్ల మండలంలో..

రొంపిచర్ల: మండలంలోని తురిమెళ్ల, విప్పర్లపల్లి, రెడ్డిపాలెం, రామిరెడ్డిపాలెం, బుచ్చిబాపన్నపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి 54వ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తురిమెళ్లలో నిర్వహించిన వేడుకలలో వైఎస్సార్ సీపీ నాయకులు కాటం బ్రహ్మయ్య, గాజుల మాణిక్యం, ఏసుపోగు ఆనందరావు, కాటం శ్రీనివాసరావు, బందెల సుబ్బారావు, గాజుల సుబ్బారావు, శ్రీనివాసరావు, కాటం చిన కోటేశ్వరరావు, మల్లయ్య, నరేంద్ర, కొనకంచి కోటి ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

- తహసీల్దార్ సుజాత
- మండలంలోని పలు గ్రామాల్లో భూ హక్కు పత్రాలు పంపిణీ



యడ్లపాడులో భూ హక్కు పత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ జి సుజాత

యడ్లపాడు: దాదాపు వందేళ్ల క్రితం నాటి రికార్డులను పూర్తిగా స్వచ్ఛీకరించి భూముల సమగ్ర రీ సర్వే ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చిందని తహసీల్దార్ జి సుజాత పేర్కొన్నారు. మండలం పరిధిలోని పలు గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీ జరుగుతున్న నేపథ్యంలో ఆమె ఆయా వివరాలను మంగళవారం విలేకర్లకు వెల్లడించారు. మండలం పరిధిలోని 13 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా భూములను సమగ్ర రీసర్వే చేసినట్లు వివరించారు. కచ్చితమైన కొలతలతో భూములను సర్వే చేసి రైతులకు శాశ్వత హక్కులు కల్పిస్తున్నట్లు తెలిపారు. సర్వే చేయడంతో పాటు ప్రజలకు రికార్డులు సంపూర్ణంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అన్ని వివరాలతో తయారు చేసిన భూ హక్కు పత్రాలు (పట్టాదారు పాస్‌పుస్తకాలు) రైతులకు ఇస్తున్నామన్నారు.

రీసర్వే వల్ల గ్రామాల్లో చాలా వరకు భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. జిల్లా నుండి యడ్లపాడు మండలానికి మొత్తం 9053 మంది రైతులకు తొలి విడతగా భూ హక్కు పత్రాలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో గ్రామాల వారీగా విశ్వనాథ కండ్రి-279, ఉన్నవ-112, యడ్లపాడు-1063, సందెపూడి-440, కారుచోల-1474, జాలాది-1300, తుర్లపాడు-962, మైదవోలు-1110, మద్రిపాలెం-174, వంకాయలపాడు-1139 రాగా ఇప్పటికీ రైతులకు ఆయా పత్రాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

జీవించడంతో పాటు ఆరోగ్యంగా ఉండే హక్కుంది

- ఎంపీడీవో హనుమారెడ్డి
- జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం
- సురక్ష క్యాంపులపై షెడ్యూల్ విడుదల



అవగాహన కల్పిస్తున్న అధికారులు

యడ్లపాడు: ఆరోగ్యవంతమైన జీవితం ప్రతి మానవుడి హక్కు అని ఎంపీడీవో వై.హనుమారెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జగనన్న ఆరోగ్య సురక్షపై ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్‌లకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి కుటుంబాన్ని విధిగా ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయి సందర్శన చేపట్టాలన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులపై వివరాలు తీసుకుని, అనారోగ్య సమస్యల్ని గుర్తించిన వారికి ఆయా వ్యాధులకు సంబంధించిన పరీక్షల్ని నిర్వహించి కేస్‌షీట్లను తయారు చేయాలని ఆదేశించారు. అలాగే వైద్య సమస్యల్ని గుర్తించిన వారికి ఈనెల 30 నుంచి అక్టోబర్ 16వ తేదీ జరిగే మెగా వైద్య శిబిరాలకు సంబంధించి టోకెన్లను అందజేస్తారన్నారు. యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి గోపీనాయక్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కింద మండలం పరిధిలో 11 మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సాధారణ రోగాలతో పాటు సుదీర్ఘ వ్యాధిగ్రస్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాంపులో ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులతో పాటు మరోఇద్దరు సూపర్‌స్పెషాలిటీ వైద్యులు హాజరవుతారన్నారు. అవసరమైన అన్ని రకాల పరీక్షలతో పాటు వ్యాధి సమస్యను బట్టి పెద్ద ఆస్పత్రులకు సైతం సిఫార్సు చేస్తారన్నారు. గ్రామీణ ప్రాంత వాసులకు ముఖ్యమంత్రి అందిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సువర్ణ అవకాశం అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పున్నారావు, హెల్త్ ఎడ్యుకేటర్ భానుమూర్తి, ఆరోగ్య పరివేక్షకులు రాజశేఖర్ తదితరులు పాల్గొని ఇంటింటి సర్వే, క్యాంపు నిర్వహణపై వివరించారు.

మెగాక్యాంపుల నిర్వహణ షెడ్యూల్..

30వ తేదీన కారుచోల (జెడ్పీహైస్కూల్), అక్టోబర్ 4న జగ్గాపురం, జాలాది కలిపి (జెడ్పీహైస్కూల్), 5న లింగారావుపాలెం (గ్రామ సచివాలయ ప్రాంగణం), 6న తుర్లపాడు (పంచాయతీ ఆఫీస్), 7న యడ్లపాడు-2 (జెడ్పీహైస్కూల్), 9న కొండవీడు (జెడ్పీహైస్కూల్), 10న వంకాయలపాడు (జెడ్పీహైస్కూల్), 11న (సొలస జెడ్పీహైస్కూల్), 12న తిమ్మాపురం (జెడ్పీహైస్కూల్), 13న ఉన్నవ (జెడ్పీహైస్కూల్), 16న చెంఘీజ్‌ఖాన్‌పేట (రైతుభరోసా కేంద్రం)లో నిర్వహించనున్నట్లు అధికారులు షెడ్యూల్‌ను విడదల చేశారు.

పేటీయం మిషన్ల ద్వారా స్త్రీనిధి రుణాలు

శావల్యాపురం: ఇక నుంచి స్త్రీనిధి రుణాలు చెల్లింపులు పేటీయం మిషన్లు ద్వారా జరుగుతాయని జిల్లా స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజరు రంతు చినబుల్లెయ్య మంగళవారం తెలిపారు. మండలంలో మూడు క్లస్టర్లు శావల్యాపురం, వేల్పూరు, కారుమంచి ఎంపిక చేశామని జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు పథకంలో ఎంపిక చేయగా పేటీయం, క్యూర్ కోడ్, యూపీఐ విధానంలో ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయటానికి పేటీయం మిషన్లు అందజేశామన్నారు. ఇప్పటి వరకు యానిమేటర్ల ద్వారా క్యాష్ రూపంలో నగదు చెల్లింపులు జరిగినట్లు చెప్పారు. ఇక నుంచి నగదు రహిత లావాదేవీల చెల్లింపులు పారదర్శకంగా జరుగుతాయన్నారు. జిల్లాలో త్వరలో స్త్రీనిధి రుణాలు చెల్లింపులు ప్రతి పంచాయతీలో అమలు జరిగేలా చర్యలు తీసకుంటామన్నారు. జిల్లాలో స్త్రీనిధి రుణాలు ఈఆర్థిక సంవత్సరంలో రూ. 142 కోట్లు 28 వేల 400 మంది మహిళా సభ్యురాలకు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకున్నామని ఇప్పటి వరకు రూ. 31 కోట్లు 5370 మంది సభ్యులకు రుణాలను అందజేశామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలనలో స్త్రీనిధి రుణాలు ద్వారా మహిళా సభ్యులు జీవనోపాదులు పెంపుదలకు ప్రతిగ్రూపుల్లోని సభ్యురాలకు రూ. 50 నుంచి రూ. లక్ష వరకు రుణ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఆయనతో పాటు ఏపీయం జి.వాసుబాబు, సీసీలు గొట్టం రమాదేవి, బేబిరాణి పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

చిలకలూరిపేటటౌన్: మండలంలోని వేలూరు గ్రామంలో పేకాట స్థావరంపై మంగళవారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ. 30,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో రూరల్ ఎస్ఐ ఎస్ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి ఆరోగ్య సురక్ష సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్

నాదెండ్ల: ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని అందులో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రజలకు మరింత ప్రయోజనం చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ఈనెల 15 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు, వలంటీర్లతో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యులు ప్రియాంక, సాయిశ్వేత, గణపవరం పీహెచ్‌సీ వైద్యులు ప్రసాద్ నాయక్ హాజరయ్యారు. సిబ్బంది అలసత్వం లేకుండా ఈ నెల 15-30 వరకూ ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి సచివాలయంలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. స్థానిక వైద్యులతో పాటూ స్పెషలిస్టులైన గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్ బృందంచే పద్నాలుగు రకాల పరీక్షలు నిర్వహించి 105 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు.

నూతన పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందజేస్తున్న కౌన్సిలర్ నన్నేసా



లబ్ధిదారులకు నగదు పంపిణీచేసిన అధికారులు, నాయకులు

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని ఓబయ్య కాలనీలో 9వ వార్డు సచివాలయంలో 23వ వార్డు కౌన్సిలర్ షేక్ నన్నేసా చేతుల మీదుగా నూతనంగా మంజూరైన 27 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహకారంతో పట్టణంలో ఆయా సచివాలయాల్లో నూతనంగా వివిధ రకాల పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: వైఎస్సార్ సామాజిక పింఛన్లు రెండవ విడత మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 237 మంది లబ్ధిదారులకు మంజూరైనట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఎంపికైన లబ్ధిదారులందరికీ ఆయా గ్రామసచివాలయాల వారీగా వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్ళి పింఛను నగదును అందజేశారన్నారు. మొదట విడతలో 159 మంది లబ్ధిదారులు ఎంపిక కాగా వీరందరికి నగదు అందజేశామన్నారు. అలాగే నేడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అర్హత కల్గిన కౌలు రైతులకు రుణాల పంపిణీపై బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీమాపై అవగాహన

నకరికల్లు: జేసీఎస్ యాప్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జేసీఎస్ మండల ఇన్‌చార్జి మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని చేజర్ల గ్రామంలో సచివాలయం కన్వీనర్లు, గృహసారథులకు ప్రమాద బీమాపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఫోన్‌లో జేసీఎస్ సైన్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు పొందుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి బొడ్లపాటి కృష్ణకుమారి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బొడ్లపాటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జంప్ రోప్ జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెదకూరపాడు: జంప్ రోప్ జాతీయ స్థాయి పోటీలకు విజయ విద్యావిహార్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తెనాలిలో నిర్వహించిన జంప్ రోప్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు హేమ తేజస్విని, గంటమల్లేశ్వరి, బిట్రగుంట బ్రహ్మశ్రీ, కవిత, షేక్ నూర్ అబ్బాస్ జాతీయ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులను పాఠశాల సెక్రటరీ కె.శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు నోముల కోటేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ వాసంతి, ఉపాధ్యాయులు కె.రాధా, శ్రీదేవి, రజిని, అనిత, లక్ష్మీ, పవన్, రామాంజనేయులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూరగాయల విత్తనాలు పంపిణీ



గోరంట్లలో విత్తనాలు అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

సత్తెనపల్లి(ముప్పాళ్ల): దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం గోరంట్లలోని ఎస్సీ కాలనీలో కిచెన్ గార్డెన్ ఏర్పాటులో భాగంగా ఆకుకూరలు, కూరగాయల విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. డీబీఆర్సీ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ప్రకృతి, సేంద్రియ, ఆర్గానిక్ పంటల ద్వారా ఆరోగ్యం మెరుగు పరుచుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సేవే ప్రాణం సేవే జీవితం సంస్థ డైరెక్టర్ నందిగం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి కిలో చొప్పున మొక్కజొన్న, ఎర్రజొన్నలు, సజ్జలు 21 మందికి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా 50 మంది డ్వాక్రా మహిళలకు 12 రకాల ఆకు కూరలు, కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. డ్వాక్రా యానిమేటర్ సరోజిని పాల్గొన్నారు.

విశాఖలో చిలకలూరిపేట వాసి ఆత్మహత్య

ఆరిలోవ (విశాఖపట్టణం): మనస్తాపంతో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన షేక్ మెహ్రీ(36), ఆమె భర్త ఖాదర్ బాషా పదేళ్ల క్రితం విశాఖ వచ్చి జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు (పాప, బాబు). భార్యాభర్తలు ఇద్దరూ ఇంటికి దగ్గరలోనే చికెన్ పకోడీ బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కొద్ది రోజులుగా మెహ్రీ అనారోగ్యం (తీవ్ర కడుపు నొప్పి)తో బాధపడుతోంది. రెండు రోజుల క్రితం బాషా చిలకలూరిపేట వెళ్లాడు. తిరిగి మంగళవారం సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. ఇంటి తలుపులు లోపల నుంచి గడియ పెట్టడంతో పాటు ఎంత పిలిచినా మెహ్రీ పలకలేదు. దీంతో స్థానికుల సహాయంతో బాషా తలుపులు తెరిచి చూసేసరికి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆమె కనిపించింది. పిల్లలిద్దరూ ఉదయం స్కూల్‌కు వెళ్లారు. ఆమె ఆత్మహత్య విషయాన్ని బాషా పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్ఐ సూర్యనారాయణ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. చిలకలూరిపేటలో ఉన్న ఆమె తల్లిదండ్రులకు ఎస్ఐ సమాచారం ఇచ్చారు.